# పర్యావరణానికి పొగ

- చెత్తకు నిప్పు పెట్టడంతో అనేక సమస్యలు
- ప్రమాదకర వాయువుల విడుదల
- ప్రజల ఆరోగ్యానికి హాని


కడియపులంక వద్ద కోటిపల్లి కాలువ గట్టుపై చెత్త నుంచి వెలువడుతున్న పొగ

**కడియం:** పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి ప్రధాన కర్తవ్యం. దానికి నష్టం కలగకుండా వ్యవహరిస్తేనే మానవ మనుగడ సాధ్యపడుతుంది. ప్రతి ఒక్కరూ తమ పిల్లలు బాగుండాలని, వారికి మంచి భవిష్యత్తు చూపించాలని కష్టపడతారు. అలాగే భావితరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని కూడా అందించాలి. ఇందుకోసం అందరూ సమష్టిగా కృషి చేయాలి. కానీ నేడు మనిషి చేసే పనులతో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చెత్తను తగలబెట్టడంతో ఘాటైన వాసనలతో వాయువులు వెలువడి పర్యావరణం కలుషితమవుతోంది.

**చెత్తకు నిప్పు**

పల్లెలను కాలుష్యం కాటు వేస్తోంది. జనావాసాల నుంచి నిత్యం వెలువడే చెత్తను పంచాయతీ కార్మికులు తగులబెడుతున్నారు. ఈ చెత్తలో ప్లాస్టిక్ తదితర అనేక వ్యర్థాలు ఉంటాయి. వీటికి నిప్పు పెట్టడం వల్ల ఘాటైన వాసనలతో పొగ వెలువడుతోంది. అటుగా వెళుతున్న ప్రజలు దాన్ని పీల్చడంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. అలాగే పొగ కారణంగా వాయు కాలుష్యం ఏర్పడుతోంది.

**అనేక ఇబ్బందులు**

గ్రామాల్లో ఇళ్లను సేకరించిన చెత్తను శివారులో డంపింగ్ చేస్తున్నారు. దాన్ని వదిలించుకోడానికి తగులబెట్టడం ఒక్కటే చౌకైన మార్గంగా ప్రభుత్వ యంత్రాంగం కూడా భావిస్తోంది. దీంతో ప్రతి రోజు చెత్త కుప్పలు రావణకాష్టాన్ని తలపిస్తున్నాయి. ఆగకుండా కాలుష్యాన్ని వెదజల్లుతూనే ఉంటున్నాయి. డంపింగ్ యార్డుల్లో నిప్పు పెట్టిన చెత్త నుంచి వస్తున్న పొగతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ ఆ విధానం మారడం లేదు.

**పర్యావరణానికి నష్టం**

పచ్చని మొక్కలతో కళకళలాడుతూ ఉండే కడియం మండలంలోని గ్రామాల్లో సైతం చెత్త కుప్పలు తగలబడుతూనే ఉంటున్నాయి. చెత్త నుంచి సంపద కేంద్రాలంటూ హడావుడి చేసిన యంత్రాంగం వాటిని పక్కన పెట్టేసింది. దీంతో గ్రామ శివార్లు, కాలువ / చెరువు గట్ల వెంబడి పేరుకుపోతున్న చెత్తకుప్పలకు నిప్పుపెట్టడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. చిన్న పిల్లల డైపర్ల నుంచి పాడైపోయిన సోఫాసెట్లు వరకూ అన్ని చెత్త కుప్పల్లోకే చేరుతున్నాయి. ఇందులో అత్యంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ వస్తువులు కూడా ఉంటున్నాయి. వీటిని తగులబెట్టకూడదని పర్యావరణ నిపుణులు మొత్తుకుంటున్నా గానీ పరిస్థితిలో ఏ మార్పు రావడం లేదు.

**రహదారుల వెంబడి..**

ప్రస్తుతం మంచు/ చల్లటి వాతావరణం నేపథ్యంలో చెత్తకుప్పల కారణంగా వెలువడుతున్న కాలుష్యం జనాలను తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. జాతీయ రహదారి వెంబడి ఉన్న గోదావరి కాలువ గట్లపై కూడా చెత్తను వేస్తున్నారు. కడియపులంక పంచాయతీ శివార్లలో కోటిపల్లి కాలువ వెంబడి వేసిన చెత్త వారం రోజులుగా తగలబడుతోంది. దీంతో జాతీయ రహదారిపై వెళ్లే వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇలా తగులబడిన చెత్త నుంచి వచ్చే వ్యర్థాలు కూడా కాలువ నీటిలో కలిసిపోతున్నాయి. ఆ నీటిని పొలాలకు వాడడం వల్ల కూడా సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

**ఊపిరాడడం లేదు**

చెత్తను తగులబెట్టడం వల్ల ఘాటైన పొగ వెలువడుతోంది. ఆ సమయంలో అటుగా వెళితే ఊపిరి కూడా అందడం లేదు. ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించడం లేదు. చెత్తను తగులబెట్టొద్దని చెబుతున్నా ఎవ్వరూ వినడం లేదు.

– వి.భీమేశ్వర్, కడియపులంక

## దివ్యాంగుల క్రికెట్ జట్టుకు అభినందనలు


దివ్యాంగుల క్రికెట్ జిల్లా జట్టు సభ్యులను అభినందిస్తున్న పోసికుమార్

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** క్రికెట్ టీం డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని జింఖానా మైదానంలో డిసెంబరు 8, 9, 10, 11 తేదీలలో దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ టోర్నీలో తూర్పుగోదావరి జిల్లా జట్టు విజేతగా నిలవాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్ ఆకాంక్షించారు. స్థానిక ఐఎల్‌టీడీ సమీపంలోని క్రీడా మైదానంలో శుక్రవారం జిల్లా క్రికెట్ టీం సెలెక్షన్, ప్రాక్టీస్ మ్యాచ్ జరిగింది. జిల్లా దివ్యాంగుల క్రికెట్ టీం కెప్టెన్ పల్నాటి బలరామకృష్ణ, దివ్యాంగ క్రీడాకారులు ఈ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడారు. అక్కడకు విచ్చేసిన ముత్యాల పోసికుమార్.. దివ్యాంగుల క్రికెట్ జట్టును అభినందించారు. కార్యక్రమంలో నాగూర్ హుస్సేన్, ఎండీ కలిస్, కె.చంద్రమౌళి, పి.ప్రసాద్, జి.రాము, డి.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రేపు వన సమారాధన

**రాజమహేంద్రవరం రూరల్:** జిల్లా కుమ్మర శాలివాహన సంఘ కార్తిక వన సమారాధన మహోత్సవం ఆదివారం జరగనుంది. మోరంపూడి బీఆర్‌కే కల్యాణ మండపం ఎదురుగా ఉన్న జూపూడి గార్డెన్స్‌లో ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది. ఈ విషయాన్ని ఆహ్వాన కమిటీ కన్వీనర్ మెరుగుమెల్లి సత్యనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు హాజరవుతారన్నారు. జిల్లాలోని సంఘీయులందరూ తరలిరావాలని ఆయన కోరారు.

**శ్రీగౌరీ (గవర)సేవా సంఘం ఆధ్వర్యంలో..**

రాజమహేంద్రవరం శ్రీగౌరీ (గవర) సేవా సంఘం కార్తిక వన సమారాధన ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి బొమ్మూరు జీపీఆర్ రోడ్డులోని దండు రామకృష్ణంరాజు తోటలో జరుగుతుందని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బుద్ధా రామచంద్రరావు, ఆళ్ల వీర్రాజు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి సంఘీయులందరూ కుటుంబ సభ్యులతో తరలిరావాలని కోరారు.

### టేబుల్ టెన్నిస్ ఎంపికలు రేపు

**ప్రకాశం నగర్:** జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం గౌతమీ టేబుల్ టెన్నిస్ అకాడమీలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అండర్ 15, బాలురు, బాలికలు, మహిళలు, పురుషులు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారు కాకినాడలో డిసెంబర్ 20, 21, 22 తేదీల్లో జరిగే అంతర్ జిల్లా స్టేట్ చాంపియన్ షిప్‌కు అర్హత సాధిస్తారన్నారు.

### ఏఆర్ డీఎస్పీగా శ్రీనివాసరావు

**కంబాలచెరువు:** జిల్లా ఏఆర్ డీఎస్పీగా శ్రీనివాసరావు రానున్నారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయనను జిల్లాకు నియమిస్తూ శుక్రవారం పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఆక్టోపస్ డీఎస్పీగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ ఏఆర్ డీఎస్పీగా పనిచేసిన భాస్కరరావు బదిలీ అయ్యారు.

### గ్రీవెన్స్ ఫిర్యాదులపై మూడు విజిట్లు తప్పనిసరి



శిక్షణలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో వీణాదేవి

**రాజమహేంద్రవరం రూరల్:** గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై ప్రతి ప్రభుత్వశాఖాధికారి తప్పనిసరిగా మూడు విజిట్లు చేసి, లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలని రాజమహేంద్రవరం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో) వీణాదేవి తెలిపారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం రాజమహేంద్రవరం డివిజనల్ అధికారులకు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)పై ఆమె అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో వీణాదేవి, కొవ్వూరు డీఎల్‌డీవో స్లీవ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన పిటీషన్‌పై ప్రీ విజిట్, పోస్టు విజిట్, ఎంక్వైరీ విజిట్ చేయాల్సి ఉందన్నారు. ఆ ఫొటోలను లాగిన్‌లో ఎప్పటి కప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో వచ్చే గ్రీవెన్స్‌ను ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా లాగిన్ అయ్యి చూసుకుని పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. గ్రీవెన్స్‌లో పిటీషన్ ఇచ్చిన అర్జీదారుడికి అర్థమయ్యే రీతిలో అధికారులు సమాధానం ఇవ్వాలన్నారు. ప్రతి సోమవారం మండలస్థాయి అధికారులందరూ ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. సమావేశంలో రూరల్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, డీఐ దిలీప్ కుమార్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### జియో సైన్సెస్ కాన్ఫరెన్స్

**రాజానగరం:** ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరిగిన జియో ఇండియా 2024 ఆరో సౌత్ ఆసియన్ జియో సైన్సెస్ కాన్ఫరెన్స్ అండ్ ఎగ్జిబిషన్‌కు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు ఇద్దరు విద్యార్థులతో కలిసి హాజరయ్యారు. ఎనర్జీ డైనమిక్స్‌లో కొత్త కోణాలను అన్వేషించడం అనే అంశంపై ఈ నెల 15 నుంచి 17 వరకూ జరిగిన ఈ సదస్సుకు 24 యూనివర్సిటీల నుంచి ఆచార్యులు, విద్యార్థులు తరలివచ్చారు.

## జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలకు చరణ్


చరణ్‌ను అభినందిస్తున్న సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ గుర్రయ్య

**రాజమహేంద్రవరం రూరల్:** జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలకు సత్యసాయి గురుకులం విద్యార్థి చరణ్ ఎంపికయ్యాడు. ఎనర్జీ కన్సర్వేషన్ ఆఫ్ ఇండియా, ఎన్‌టీపీసీ సింహాద్రి ఆధ్వర్యంలో ఈ నెల 21న విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు జరిగాయి. వీటిని రాష్ట్రం నలుమూలల నుంచి గ్రూప్ ఏ, బీ విభాగాలలో 110 విద్యార్థులు హాజరయ్యారు. ఈ స్పాట్ పెయింటింగ్ పోటీలో సత్యసాయి గురుకులానికి చెందిన 7వ తరగతి విద్యార్థి బీఎస్‌పీ చరణ్ వేసిన (ప్రొటెక్ట్ నేచర్స్ గిఫ్ట్స్, ఎంబ్రస్ సస్టైనబుల్ షిఫ్ట్స్) చిత్రానికి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా చరణ్‌కు రూ.30 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని ఎన్‌టీపీసీసీ జీఎం సమీర్ శర్మ చేతుల మీదుగా అందుకున్నాడు. అలాగే డిసెంబర్‌లో జరిగే జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలకు అర్హత సాధించాడు. మరో విద్యార్థి డి.హర్షవర్ధన్ (10వ తరగతి) ప్రత్యేక బహుమతిగా రూ.7500, ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఆ విద్యార్థులను, చిత్రలేఖన ఉపాధ్యాయుడు మోటూరి శ్రీనివాసరావును ప్రిన్సిపాల్ గుర్రయ్య, కరస్పాండెంట్ ఎ.శ్యామ్ సుందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

## నేడు సత్యసాయిబాబా జయంత్యుత్సవం

**రాజమహేంద్రవరం రూరల్:** సత్యసాయిబాబా జయంత్యుత్సవం శనివారం ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ మేరకు రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో విస్తృతంగా ఏర్పాట్లు చేసినట్లు కరస్పాండెంట్ అయోధ్యుల శ్యామ సుందర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున ఓంకారం, సుప్రభాతం నగర సంకీర్తన, ఉదయం 9 గంటలకు బాబా పాదుకలకు చిత్రపటానికి అష్టోత్తర పూజ, విద్యార్థులతో మాతృపూజ, సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహా మంగళ హారతితో ఉత్సవాలు ముగిస్తామని తెలిపారు.

## రేషన్ బియ్యంలో ఎన్నో పోషకాలు


రేషన్ బియ్యం తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న రంగా ప్రసాద్

**సీటీఆర్ఐ:** రేషన్ బియ్యంలో అనేక పోషకాలు ఉన్నాయని, వీటిని రోజూ అన్నంగా వండుకోవడంతో పాటు పిండి వంటలు చేసుకుని తినడం వల్ల శరీరానికి పోషకాలు సమృద్ధిగా అందుతాయని రాజమహేంద్రవరం డివిజన్ అసిస్టెంట్ గ్రైన్ పర్వేజింగ్ ఆఫీసర్ (ఏజీపీవో) రంగా ప్రసాద్ అన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు శుక్రవారం అన్నపూర్ణమ్మ పేటలో రేషన్ బియ్యం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యంలో కెర్నల్స్ వంటి పోషకాలు ఉంటాయన్నారు. కొందరు ఈ బియ్యాన్ని దళారులకు తక్కువ ధరకి విక్రయిస్తున్నారన్నారు. రేషన్ బియ్యం వినియోగం వల్ల కలిగే ఉపయోగాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మండల సప్లయి అధికారి ఎం.నాగలక్ష్మి పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై నాగరత్నం

**కంబాలచెరువు:** ట్రాఫిక్ నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై నాగరత్నం సూచించారు. స్థానిక కంటిపూడి రామారావు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, విలువలు, విద్యపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఆటోల్లో వెనుక వైపు ప్రమాదకరంగా కూర్చుని ప్రయాణిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 112కు డయల్ చేయాలన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపకూడదని, నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మహిళా రక్షక బృందంతో పాటు భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సభ్యులు వి.కుమారి, ఎల్.అప్పయమ్మ, ప్రధానోపాధ్యాయుడు పులుగుర్త దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## పుష్కరాల్లో ప్రాణనష్టం లేకుండా చర్యలు చేపట్టాలి


సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

**సీటీఆర్ఐ:** గత పుష్కరాల అనుభవం దృష్ట్యా 2027లో పుష్కరాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రానున్న పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు స్థానిక నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. గోదావరి పుష్కరాలు సజావుగా, సక్రమంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. సానబోయిన రామారావు మాట్లాడుతూ 2027లో జరిగే పుష్కరాలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలన్నారు. గోదావరి పుష్కరాలకు నగరానికి 10 కోట్లమంది యాత్రికులు వచ్చే అవకాశం ఉందని, వారికి అవసరమైన భోజన, వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. వైస్ చైర్మన్ ఎల్వీ ప్రసాద్ మాట్లాడుతూ పుష్కరాల సమయంలో రాజమహేంద్రవరం సిటీ, రూరల్, కొవ్వూరు, రాజానగరం వంటి ప్రాంతాలకు బంధువుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. పేద బీసీ, ఎస్సీ కుటుంబాలకు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం లేదా నిత్యావసరాలు అందచేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు డి.జార్జి ఆంటోనీ, ఉపాధ్యక్షుడు బత్తిన ప్రసాద్, ఉప్పిడి గంగాధర్, కోశాధికారి గుత్తుల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి గొర్సా తాతబ్బాయి యాదవ్ పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు సాయం


బాధితులకు బియ్యం, నిత్యావసరాలు, ఇతర సామగ్రిని అందజేస్తున్న గిరజాల వీర్రాజు

**రాజమహేంద్రవరం రూరల్:** పిడింగొయ్యి శ్రీలక్ష్మీనగర్‌లో తాటాకిల్లు కాలిపోయి, సర్వం కోల్పోయిన చూచికొండ సత్యవతి, బిడిగి పద్మ కుటుంబాలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, బాధ్యతా సేవా సంస్థ అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు), పార్టీ స్థానిక నాయకులు మేడి త్రిమూర్తులు, పిల్లా లక్ష్మణరావు, చిలకల రామారావు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు బాధ్యత సంస్థ ద్వారా నిత్యావసరాలు, బియ్యం, దుప్పట్లు, చీరలు, వంట సామగ్రి, నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎలుగొండ రవి, పున్నమ రాజు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి మార్ని వాసుదేవరావు, పలువురు టీడీపీ నేతలు బాధితులను పరామర్శించారు. రెవెన్యూ అధికారులు ఆ రెండు కుటుంబాలకు పది కేజీల బియ్యం, కిలో కంది పప్పు, కిలో పంచదార చొప్పున అందజేశారు.

## నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు

**కడియం:** మండలం పరిధిలో శని, ఆదివారాలలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.పోసిబాబు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద జరిగే ఈ శిబిరాల్లో 1.1.25 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. కొత్త ఓటర్లు దరఖాస్తులతో పాటు ఓటు తొలగింపులు కూడా చేపడతారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ బూత్ లెవల్ అధికారి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

## 7న అంతర్జాతీయ సెమినార్

**కంబాలచెరువు:** స్థానిక ఆర్ట్స్ కళాశాలలో డిసెంబర్ 7వ తేదీన కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ది సినర్జీ ఆఫ్ లాంగ్వేజ్ లిటరేచర్ అనే అంశంపై బ్లెండెడ్ విధానం(ఆన్‌లైన్–ఆఫ్‌లైన్)లో అంతర్జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్రరావు శుక్రవారం తెలిపారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఆసక్తి ఉన్నవారందరూ తమ పరిశోధన పత్రాలను ప్రచురణ కోసం 'జీసీఆర్‌జేవైఇంజింట్సె మ్ఎట్‌దిరేటాఫ్‌జీమెయిల్'కు ఈ నెల 25వ తేదీలోపు పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు 73825 23736 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించాలి


బహుమతులు అందజేస్తున్న చలపతిరావు తదితరులు

**రాజమహేంద్రవరం సిటీ:** మహిళలు తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని ఆర్థిక అభ్యున్నతి సాధించాలని విశ్రాంత టెలికం డిప్యూటీ జనరల్ మేనేజర్ పీవీ చలపతిరావు అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన 75వ బ్యాచ్ ఉచిత కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సంస్థ మహిళల కోసం టైలరింగ్ డ్రెస్ మేకింగ్, మగ్గం వర్కులలో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. ఈ మేరకు నిర్వాహకులు రాంబాబు సేవలను కొనియాడారు. మరో ముఖ్య అతిథి, విశ్రాంత రైల్వే అధికారి చర్ల రాజరాజేశ్వరి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం ఇలాంటి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు అవసరం ఎంతో ఉందన్నారు. స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ 27 ఏళ్లుగా దాదాపు 18 వేల మంది మహిళలకు టైలరింగ్ అండ్ డ్రెస్ మేకింగ్, మగ్గం, కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ అందించామన్నారు. అనంతరం టైలరింగ్, మగ్గం వర్కులలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో టీచర్ దివ్య, సిబ్బంది మీరా కుమారి, ప్రసాద్, హరికృష్ణ పాల్గొన్నారు.

## 27న వివిధ వస్తువులకు బహిరంగ వేలం

**రాజమహేంద్రవరం రూరల్:** ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) రాజమహేంద్రవరం డిపో పరిధిలోని వివిధ ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించిన వివిధ వస్తువులకు ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ విషయాన్ని ఏపీఎస్‌బీసీఎల్ రాజమహేంద్రవరం డిపో మేనేజర్(ఇన్‌చార్జి) ఎం.అబ్దుల్ ఖదీర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం హార్లిక్స్ ఫ్యాక్టరీ పక్కన ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని దాసరి సీతారామకృష్ణ గోడౌన్ వద్ద వేలం జరుగుతుంది. ఈ వేలంలో 131 ఫ్రీజర్లు (ఒక్కింటికి నిర్ణయించిన ధర రూ.22,680), 132 ఇన్వర్టర్ అండ్ బ్యాటరీలు(ఒక్కింటికి రూ.18,630), 145 క్యాష్ చెస్టులు (ఒక్కింటికి రూ.6,120), 287 స్కానర్లు (ఒక్కింటికి రూ.3,400), 145 క్యాష్ కౌంటింగ్ మెషీన్ల (ఒక్కింటికి రూ.810)ను వేలం వేస్తారు. ఎక్కడ ఉన్న వస్తువులు అక్కడే ప్రకారంగా వేలం జరుగుతుంది. ఆసక్తి కలవారు ముందుగా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు నకలు సమర్పించి, దరఖాస్తు రుసుముగా రూ.5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలి. పాట దక్కించుకున్న వారు 18 శాతం జీఎస్టీతో కలిపి చెల్లించాలి. పాటపాడుకొని వారికి దరఖాస్తు రుసుమును తిరిగి చెల్లిస్తారు. పూర్తి సమాచారం కోసం 94407 85620, 95059 68533, 99493 51502 నంబర్లను సంప్రదించాలి.

## గోతుల మయం.. ప్రయాణం కష్టం


ఐఎల్‌టీడీ సెంటర్‌లో ఏర్పడిన భారీ గొయ్యి


బాలాజీపేట సెంటర్‌లో రోడ్డు దుస్థితి

**రాజమహేంద్రవరం రూరల్:** స్థానిక ఐఎల్‌టీడీ సెంటర్, బాలాజీపేటలో ఆర్అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారింది. దీంతో ప్రయాణానికి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు అట్టహాసంగా గోతుల పూడ్చే కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గానికి ఒక రోడ్డుకు మరమ్మతులు చేశారు. కానీ నిత్యం రద్దీగా ఉంటే రోడ్లను వదిలేశారు. ఐఎల్‌టీడీ సెంటర్ వద్ద రైల్వే స్టేషన్ రోడ్డు ఎక్కే ప్రాంతంలోనూ, బాలాజీ పేట సెంటర్‌లోనూ రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.